జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 20-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 542 పేజీలు: 3 వెల: రూ.7

# పొలాల్లో అగ్ని కీలలు

- జిల్లుండలో అగ్ని ప్రమాదం
- ఏడు బస్తాల ధాన్యం ఆహుతి-భోరుమన్న రైతు

మందస, డిసెంబరు 19(వార్త): మందస మండలంలోని జిల్లుండ గ్రామం సమీపంలో గల పొలాల్లో గురువారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మణరావు తన పొలాల్లో ధాన్యం నూర్చుతున్నారు. పొలం మొత్తం కోయగా.. వరి దుబ్బులకు ప్రమాదవశాత్తూ అగ్ని మంటలు అంటుకున్నాయి. దీంతో మందస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఇదే ప్రాంతంలో పొలం పనులు చేస్తున్న రైతులు, గ్రామస్తులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు ధాన్యం ఉంచిన ప్రదేశం వరకు రావడంతో పాటు కొన్ని ధాన్యం బస్తాలకు మంటలు అంటుకున్నాయి. రైతులు, గ్రామస్తులు ఐక్యంగా ధాన్యాన్ని బయటకు తీసుకువచ్చారు. అగ్ని మాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేసింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఏడు బస్తాల ధాన్యం నష్టం జరిగిందని అంచనా వేశారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంట ధాన్యం కాలిపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.









## సుపరిపాలనకు ..
# వాజ్‌పేయి మార్గదర్శి

-మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్

-ఘనంగా అటల్ విగ్రహావిష్కరణ

**శ్రీకాకుళం, డిసెంబరు 19(వార్త):** దేశాభివృద్ధికి, సుపరిపాలనకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ మార్గదర్శకుడని రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలిలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్ని గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. వాజ్‌పేయీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, స్వర్ణ చతుర్భుజి వంటి రవాణా వ్యవస్థల ఆధునీకరణే నేటి భారత్ పురోగతికి బలమైన పునాదులని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీతి, నిజాయితీతో కూడిన పాలనను అందిస్తున్నాయని, సుపరిపాలన ద్వారానే సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించారు.

### వైద్య విద్యను సామాన్యుడికి చేరువ చేసేందుకు పీపీపీ..

వైద్య విద్యను సామాన్యుడికి చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రులు స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ వైద్య కళాశాలలను నిర్మించి, రాష్ట్రంలో డాక్టర్ల కొరతను తీర్చవచ్చని తెలిపారు. కళాశాలల నిర్వహణలో ప్రైవేటు భాగ స్వామ్యం ఉన్నప్పటికీ, యాజమాన్య హక్కులు, సీట్ల కేటాయింపుపై పూర్తి నియంత్రణ ప్రభుత్వానిదే ఉంటుందని వారు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ సాగుతోందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు ఎన్ఈఆర్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, కూన రవి, మామిడి గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



మిత్రమా..
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు



మా శ్రేయోభిలాషి...నిరంతర సేవా తత్పరుడు..
నిగర్వి..నిరాడంబరుడు.. స్నేహితుడు.. సోదర సమానుడు..
శ్రీ॥ కోంద్రు జగదీష్ గార్కి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
తెలియజేసుకుంటూ...

నీ.. అభిమాని

శ్రీ॥ కోంద్రు జగదీష్ గారు

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

శనివారం 20 డిసెంబరు 2025 2

## చిన్నారుల భవిష్యత్‌కు రెండు చుక్కలు



**జి.సిగడాం, డిసెంబరు19(వార్త):** పోలియో చుక్కలు తప్పక వేయించాలని భాతువ పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూష, పతిష్ట శర్మ, బి.యశ్వంత్,సుమ బిందు తెలిపారు. పోలియో నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు మండలంలో ఈ నెల 21న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని శుక్రవారం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు ఒక్క చిన్నారూ మిస్ కాకుండా పోలియో చుక్కలు వేయించడమే లక్ష్యంగా జి.సిగడాం,భాతువ మండల వైద్య యంత్రాంగం క్షేత్రస్థాయిలో అప్రమత్తమైందన్నారు.

ఈ కార్యక్రమానికి మండల పరిధిలోపలు గ్రామాల్లో ఉన్న ఆయుష్ మందిర్ వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పలు సూచనలు తెలియజేశామని వెల్లడించారు. ఎమ్ ఎల్ హెచ్పీలు, ఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు, తదితర వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.

## రుణాలను శత శాతం చెల్లించాలి : ఏపీఎం



**మందస, డిసెంబరు 19(వార్త):** మహిళా సంఘాలు మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవడంతో పాటు, గృహ వినియోగానికి తీసుకున్న అన్ని రకాల రుణాలుకు కూడా శత శాతం రీపేమెంట్ ఉండాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందసలో తీసుకున్న స్త్రీ నిధి రుణాలను వాయిదాలు సక్రమంగా చెల్లించనందున తక్షణమే రికవరీ చేయాలని సూచిస్తూ సభ్యులకు అవగాహన కల్పించారు. వాయిదాలు సక్రమంగా చెల్లించిన గ్రామ సంఘాల్లో సభ్యులకు అతి తక్కువ వడ్డీ కేవలం 92 పైసలకే ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా రుణాలను మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పాత అప్పును వాయిదాల ప్రకారం చెల్లించే వారికి కేవలం 48గంటలలోనే సంఘానికి 8 లక్షల రూపాయల వరకు మీరు ఏ బ్యాంకుల చుట్టూ తిరగకుండా బయోమెట్రిక్ వేయించి రుణం మంజూరు చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, స్త్రీ నిధి మేనేజర్ కె.రాము, వీఓఏలు గాయత్రి, శారద పాల్గొన్నారు.

## ప్రతి ఊరు పరిశుభ్రంగా ఉండాలి



**జి.సిగడాం, డిసెంబరు 19(వార్త):** ప్రతి ఊరు, ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీఎల్పీఓ గోపీబాల సూచించారు. శుక్రవారం ఆయన జి.సిగడాం మండలంలోని భాతువ, జాడ గ్రామాలను ఎంపీడీవో జి.రామకృష్ణారావు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్య సిబ్బందితో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలు లేకుండా అరికట్టాలని సూచించారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వీరితో పాటు సర్పంచ్ దబ్బాడ కళ్యాణి, గోక మహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుందరమ్మ, వెంకటనాయుడు, ఎంఎల్‌హెచ్పీ కావ్య, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## క్లీన్ మున్సిపాలిటీగా తయారు చేయండి

### -కమిషనర్‌తో కలిసి వార్డుల్లో పర్యటించిన వజ్జ



**పలాస, డిసెంబరు 19(వార్త):** పలాస మున్సిపాలిటీని చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఏపీటీపీసి చైర్మన్ వజ్జ బాబురావు పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఉదయం 6.30 గంటల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో పలాస మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో కలిసి పర్యటించారు. పలు అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వజ్జ మాట్లాడుతూ మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దాలని, కాలువలు, రహదారులపై దృష్టి సారించాలని కోరారు. గతంలో వేసిన కాలువలు, రహదారులు మరమ్మతులకు గురై ఉన్నాయని చెప్పారు. వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఎమ్మెల్యే సహకారంతో పనులకు శ్రీకారం చుట్టాలని, ఎటువంటి ఆటంకాలైన ఎమ్మెల్యే చూసుకుంటారని చూసుకుంటారని భరోసా ఇచ్చారు. వీరితోపాటు ఏఈలు మహేష్, కిరణ్ మునిసిపల్ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## యూనిఫాంల వితరణ



**పలాస, డిసెంబరు 19(వార్త):** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ టెన్నికాయిట్ పోటీలకు జరుగుతున్న శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బాల, బాలికల జట్లకు యూనిఫాంలను అందించారు. క్రీడా ప్రోత్సాహకుడు స్వర్గీయ సురేష్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన శిష్యుడు బమ్మిడి వెంకటేష్ వీటిని వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.రవికుమార్, వ్యాపారవేత్త మల్లా భద్రయ్య, టెన్నికాయిట్ సంఘ జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్ కుమార్, ఆటల మాస్టార్లు పి.తవిటయ్య, పి.సునీత, కె.రామారావు పాల్గొన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు

**పలాస, డిసెంబరు 19(వార్త):** పలాస రైల్వే క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో సోంపేట మందసా జట్లు ఫైనల్లో తలపడగా మందస జట్టు విజయం సాధించింది. విజేత జట్టు జిల్లాస్థాయి ఉపాధ్యాయ పోటీలకు ఎంపికైనట్లు పి.తవిటయ్య తెలియజేశారు. కార్యక్రమంలో పలాస, మందస ఎంఈఓలు సీహెచ్ సత్యం, ఎం.లక్ష్మణరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పలాస ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్ బహుమతులు ప్రదానం చేశారు. సీహెచ్ పద్మలోచన, ఎస్.చంద్రశేఖర్, ఎస్.రామారావు, బి.రవికాంత్, పి.గణేష్, పి.గజేంద్ర న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు.



# మత్తు రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

### - ఘనంగా అభ్యుదయం సైకిల్ యాత్ర

**నరసన్నపేట, డిసెంబరు 19(వార్త):** మత్తు రహిత సమాజ నిర్మాణమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా శుక్రవారం నరసన్నపేట పట్టణంలో నిర్వహించిన "అభ్యుదయం సైకిల్ యాత్ర"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సత్యవరం జంక్షన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సైకిల్ ర్యాలీగా ఈ కార్యక్రమం సాగింది. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితానికే కాదు కుటుంబం, సమాజం భవిష్యత్తుకూ తీవ్ర నష్టం కలిగిస్తుందని హెచ్చ రించారు. యువతను మత్తు బారిన పడకుండా కాపా డేందుకే ఈ అభ్యుదయం సైకిల్ యాత్రను సామాజిక ఉద్యమంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మత్తు రహిత సమాజ సాధనకు సంకల్పం చేయాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న మత్తు వ్యతిరేక కార్యక్రమాలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి ఈ ఉద్యమం విస్తరించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ మత్తు రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతు తెలిపారు.







# పీపీపీపై పోరాటం చరిత్రాత్మకం

### _ ప్రజా వ్యతిరేకతతో కూటమి సర్కార్ కళ్లు తెరవాలి

### -వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి




**పలాస, డిసెంబరు 19(వార్త):** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి సర్కార్ పీపీపీ విధానం అంటూ ప్రైవేట్ రంగానికి కట్టబెట్టేందుకు తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సీపీ కొనసాగించిన పోరాటం చరిత్రలో ఇంతగా గొప్ప ఉద్యమ పోరాట ఘట్టం ఎక్కడా జరగలేదని, ఇదంతా కూటమి సర్కార్ పై వ్యతిరేకత కనిపిస్తుందని చెప్పడానికి వైఎస్ఆర్సిపి అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ ను కలవడానికి వెళ్ళినప్పుడు పార్టీ శ్రేణులతో పాటు భారీగా తరలి వచ్చిన ప్రజలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఏమిటని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. శుక్రవారం ఆయన పలాసలో విలేకరులు తో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ పేరుతో చేపట్టిన ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల పత్రులను రాష్ట్ర గవర్నర్ కు అందజేయడానికి వెళ్ళినప్పుడు జననేత వైయస్ జగన్ కు జన నీరాజనం పట్టిన తీరు చూస్తే, కూటమి సర్కార్ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఏమిటో స్పష్టమైంది అన్నారు. పేదవానికి వైద్యంతో పాటు నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి వైద్య విద్యను దూరం చేయటానికి కూటమి సర్కార్ చేస్తున్న ప్రయత్నాన్ని ఈ ఉద్యమం ద్వారా కచ్చితంగా నిలుపుదల ఖాయమన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు పార్టీ శ్రేణులు నిర్వహించిన కోటి సంతకాల సేకరణకు ప్రజల్లో భారీగా స్పందన లభించింది అని తెలిపారు. విజయవాడలో భారీ ఎత్తున తరలి వచ్చిన జన సాగరం చూసి కూటమి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయన్నారు. వైయస్సార్సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో భవిష్యత్‌లో నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వైద్య విద్యార్థులకు మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్న సంకల్పంతో నాడు వైయస్ జగన్ సర్కార్ ముందుకు అడుగులు వేసిందన్నారు. మరికొన్ని కళాశాలలో అందుబాటులో రావడానికి కేవలం 5000 కోట్లు అవసరమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గాని ..రెండు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ, 5000 కోట్ల రూపాయలు మెడికల్ కాలేజీల నిర్మాణానికి అవసరమైన గాని పట్టించుకోకుండా, ప్రైవేటీకరణకు సిద్ధం కావడం కూటమి సర్కార్ వైఫల్యమేనని బమ్మిడి దుర్యోధనరావు విమర్శించారు. కూటమి సర్కార్ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడంలో కూటమిన్ నేతల కుట్ర ఉందని, ఇది ఒక పెద్ద స్కాం అన్నారు.కూటమి సర్కార్ పీపీపీ విధానం నిర్ణయం ఉపసంహరించుకొనేవరకు వైఎస్ ఆర్సీపి మెడికల్ కాలేజీలను కాపాడుకునేందుకు రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని బమ్మిడి దుర్యోధనరావు హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**పలాస, డిసెంబరు 19(వార్త):** గతనెల 26న రామేశ్వరం వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై మధురై హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీకాకుళం జిల్లా పలాస మండలం వీరరామచంద్రపురం గ్రామానికి చెందిన పైడి.తారకేశ్వరరావు (28)మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. పైడి తారకేశ్వరరావు మృతదేహం చూసేందుకు గ్రామస్తులు, చుట్టుపక్క గ్రామస్తులు చేరుకోవడంతో జనసంద్రంగా గ్రామం మారింది. అయ్యప్ప మాలాధారణలో భాగంగా ఆరుగురు అయ్యప్పలు తమ గ్రామ నుంచి కారులో వెళ్లి శబరిమల దర్శనాన్ని పూర్తిచేసుకుని గతనెల 26 న రామేశ్వరం వెళ్తుండగా సుమారు 5 గంటల ప్రాంతంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, రాజు రామేశ్వరంలో గల ఓ ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈనెల 17 బుధవారం మృతి చెందాడు. సంఘటన జరిగిన స్థలంలో ఇద్దరు చనిపోగా ఈనెల 1న ఒకరు, ఈ నెల 17వ తారీఖున ఒకరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య మొత్తం నాలుగు చేరింది. ఒకరు పలాస లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంకొకరు చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. తారకేశ్వరరావు మృతదేహం అంబులెన్స్‌లో వస్తుందన్న వార్త విని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వేలాదిమంది చుట్టుపక్కల గ్రామస్తులు చేరుకుని అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు.

## విద్యుత్ మీటర్ ఇచ్చి ఆదుకోండి

### -లక్ష్మీపురం రైతు వేడుకోలు



**పలాస, డిసెంబరు 19(వార్త):** పలాస మండలం లక్ష్మీపురంలోని తన పొలంలో వ్యవసాయ విద్యుత్ మీటరు కనెక్షన్‌కు వేసిన కేబుల్ చోరీ కావడంతో మీటర్‌ను సైతం సిబ్బంది తీసుకుపోయారని, విద్యుత్ మీటర్ ఇచ్చి తన వ్యవసాయానికి సహకరించాలని 90 ఏళ్ల వృద్ధ రైతు ఉప్పాడ సూర్యనారాయణ విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పలాస జాతీయ రహదారి పక్కనున్న తన 2.50 ఎకరాల పొలంలో ఏసీ నెంబర్ 20 విద్యుత్ మీటర్ ఉండేదన్నారు. తాను అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన నేపథ్యంలో విద్యుత్ కేబుల్ చోరీ గురైందని, మీటర్‌ను సిబ్బంది పట్టుకు పోయారని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. పలాసలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి మీటర్ కోసం పలుసార్లు వెళ్లి విజ్ఞప్తి చేసినా కనికరం చూపలేదని, వయోభారంతో వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి తనకు మీటర్ ఇచ్చి తన వ్యవసాయానికి సహకరించాలని వేడుకున్నారు.

## శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.51,116 విరాళం

**కవిటి (జలుమూరు), డిసెంబరు 19(వార్త):** కవిటి బీచ్ రోడ్‌లో నిర్మాణం జరుగుతున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి తెలంగాణ 26 బీసీ కులాల జేఏసీ ప్రధాన కార్యదర్శి, శ్రీరామ రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొడ్డేపల్లి శ్రీరామ చంద్రమూర్తి రూ.51,116 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు.జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ విన్నపం మేరకు ఈ విరాళం అందించారు. ఆలయ నిర్మాణం వేగవంతం కావాలని, భక్తుల సహకారంతో మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి చెందాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, డైరెక్టర్ బార్ల చిన్న బాబు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సూర బాలకృష్ణ, పప్పల వెంకటరమణ, బీపీ రెడ్డి, మొగిలిపురి సీతారాం తదితరులు పాల్గొన్నారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**పలాస, డిసెంబరు 19(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' ( ఎస్ఏఎస్ఏ) కార్యక్రమంలో భాగంగా పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం స్థానిక జీడిపప్పు క్రూడ్ మిషనరీ సంస్థను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ పర్యటనను ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మధు పర్యవేక్షించారు. పరిశ్రమలలో వ్యర్థాలను కూడా తిరిగి ఉపయోగకరమైన, విలువైన ఉత్పత్తులుగా ఎలా మార్చవచ్చో విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి వివరించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు విద్యార్థులకు జీడి పిక్కల నుండి నూనెను తీసే ఆధునిక విధానం, ఉప ఉత్పత్తులు ఆయిల్ తీసిన తర్వాత మిగిలే 'స్లడ్జ్', 'కేక్' తయారీ ప్రక్రియలను వివరించారు. ఈ వ్యర్థ పదార్థాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ఎగుమతి అవకాశాలను విద్యార్థులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందనర్భంగా డిగ్రీ ప్రిన్సిపాల్ డా.జె.వెంకటలక్ష్మి మాట్లా డుతూ కేవలం తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, ఇలాంటి పారిశ్రామిక సందర్శనల ద్వారా విద్యార్థులు క్షేత్రస్థాయి అనుభవాన్ని గడించాలని, తద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నాక్ కోఆర్డినేటర్ వెంకటరమణ, కామర్స్ విభాగ అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తర్లిలో గిరిజన ఆచారాలపై ఐటీడీఏ విచారణ

### -కుల ధ్రువీకరణ అంశంపై క్షేత్రస్థాయి పరిశీలన

**సారవకోట, డిసెంబరు 19(వార్త):** తొగిరి పంచాయతీ పరిధిలోని తర్లి గ్రామంలో గిరిజన ఆచారాలపై సీతంపేట ఐటీడీఏ అధికారులు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. గ్రామంలోని ఏనేటి కొండ కులానికి చెందిన వారు అనుసరిస్తున్న సంప్రదాయాలు, జీవన విధానాన్ని అధికారులు అధ్యయనం చేశారు. ఈ గ్రామానికి చెందిన గిరిజనులు 2005 వరకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందినట్లు తెలిపారు. అనంతరం వివిధ కారణా లతో వారికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కావడం నిలిచిపోయిందని పేర్కొ న్నారు. ఈ సమస్యను ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో, ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు గురువారం అధికారిక విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానం తదితర అంశాలపై సమాచారం సేకరించి నివేదిక రూపొందించనున్నట్లు ఐటీడీఏ అధికారులు తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని వారు తెలిపారు.



# చెత్త..చెత్తగా.. జగన్నాథవలస

**-అలముకున్న పారిశుధ్యలేమి**

**-అధికారుల నిర్లక్ష్యం**

**- ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం**

**- నిరుపయోగంగా**

**చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం**

**- విజృంభిస్తున్న దోమలు**

**(జి.సిగడాం)**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా పారిశుధ్యం వైపు దృష్టి సారించి అధికారులకు ఆదేశాలు జారీ చేసినా.. పలుమార్లు జిల్లా అధికారులు గ్రామాలను సందర్శించినా ఫలితం లేకుండా పోతుంది. ఆ మాటలను..ఆదేశాలను సిబ్బంది బేఖాతర్ చేస్తున్నట్టు కనిపిస్తోంది. జగన్నాథవలసలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత గ్రామ, మండల స్థాయి అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని ప్రజలు పలువురు ఆరోపిస్తున్నారు. పాఠశాల చుట్టుపక్కలా ఒక



వైపు చెత్త, చెదారాలు.. మరోవైపు దుర్వాసనతో కూడిన మురిగి డ్రైనేజీ ఉండదంతో అటు వైపు వెళ్తున్న ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ చెత్తనంతటినీ సంపదగా మార్చాలన్ని ఆ గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కూడా నిరుపయోగకరంగా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పం దించి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.





## పోలాకిలో రైస్ మిల్లులపై ఆకస్మిక తనిఖీలు



**పోలాకి, డిసెంబరు 19(వార్త):** పోలాకి మండలంలోని పలు రైస్ మిల్లులను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శిరీష గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలానికి చేరుకున్న ఆమె పోలాకి, పిన్నింటిపేట గ్రామాల్లోని రైస్ మిల్లులను పరిశీలించి, మిల్లర్లతో నేరుగా మాట్లాడారు. తనిఖీల సందర్భంగా అక్రమాలకు పాల్పడితే ఎలాంటి మినహాయింపులు లేకుండా మిల్లులను సీజ్ చేస్తామని ఆమె కఠినంగా హెచ్చరించారు. ఇటీవల పోలాకి మండలం నుంచి పలు ఫిర్యాదులు అందడంతో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు తాను స్వయంగా వచ్చానని శిరీష విలేకరులకు వివరించారు. ఈ తనిఖీల్లో సంబంధిత శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన బియ్యం సరఫరా చేయాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందని, ఏవైనా ఉల్లంఘనలు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## అభ్యుదయం సైకిల్ యాత్రకు ఘన స్వాగతం



**నరసన్నపేట, డిసెంబరు 19(వార్త):** మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో చేపడుతున్న అభ్యుదయం సైకిల్ యాత్ర శుక్రవారం నరసన్నపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టి, యాత్రకు ఘన స్వాగతం పలికారు. యాత్ర సత్యవరం కూడలి వరకు చేరుకోగానే తీన్మార్ డబ్బులు, తప్పెట గుళ్లు, సంప్రదాయ వేషధారణలతో కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలను వివరించే నినాదాలు, ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు కృష్ణమ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. అభ్యుదయం సైకిల్ యాత్ర ద్వారా గ్రామ గ్రామాన డ్రగ్స్ వ్యతిరేక సందేశం చేరుతుందని, యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడంలో ఈ యాత్ర కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## పన్ను ఆటోమేటిక్ పెంపు విధానం రద్దు చేయాలి



**పలాస, డిసెంబరు 19(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను, వ్యాపార పన్నును ప్రతీ సంవత్సరం 15% ఆటోమేటిక్‌గా పెంచే విధానం సంపూర్ణంగా అన్యాయమైనదని, తక్షణమే రద్దు చేయాలని ప్రముఖ న్యాయవాది, సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా) డిమాండ్ చేశారు. పలాస స్వగృహంలో శుక్రవారం మాట్లాడుతూ ఈ విధానం దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ తప్పనిసరిగా అమలులో లేదని, దీనిని అమలు చేయాలని చెప్పే ఏ కేంద్ర ప్రభుత్వ చట్టం కూడా లేదని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రజలపై బలవంతంగా ఆర్థిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే విద్య ఖర్చులు, వైద్య వ్యయాలు, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, ఇంధన ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో ప్రతీ సంవత్సరం ఆటోమేటిక్‌గా 15% పన్ను పెంపు అంటే సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపైమరో భారమే పడుతుందని చెప్పారు. గత సంవత్సరం మీ ఇంటి పన్ను బిల్‌ను, ఈ సంవత్సరం వచ్చిన పన్ను బిల్‌ను ఒక్కసారి తప్పకుండా పరిశీలించాలని కోరారు. 15% ఆటోమేటిక్ పన్ను పెంపు స్పష్టంగా కనిపిస్తుందని, తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని, ప్రజలపై ఉన్న పన్నుల భారాన్ని తగ్గించాలిని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా ఆలోచించాల్సిన, స్పందించాల్సిన అవసరం ఉందని, ఇది రాజకీయ అంశం కాదని, ఇది ప్రజల జీవన సమస్యగా చూడాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రశ్నని అన్నారు. న్యాయం కోసం కలిసి పోరాడుదామని, న్యాయం సాధిద్దామని పిలుపునిచ్చారు. ల

## దీర్ఘాసిలో 9వ శతాబ్దపు శిలాశాసన పరిశీలన

### -పురావస్తు శాఖ ప్రతినిధి విస్తాగోయిన్ క్షేత్రస్థాయి అధ్యయనం



**పోలాకి, డిసెంబరు 19(వార్త):** పోలాకి మండలం, దీర్ఘాసి గ్రామంలో ఉన్న 9వ శతాబ్దానికి చెందిన శిలాశాసనాన్ని ఢిల్లీకి చెందిన పురావస్తు శాఖ విభాగం పరిశీలకురాలు విస్తాగోయిన్ గురువారం సాయంత్రం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బౌద్ధుల కాలంనాటి అవశేషాలను అధ్యయనం చేసి, వాటికి సంబంధించిన ఫోటోలను సేకరించారు. ఈ ప్రాంతంలో లభ్యమైన శిలాశాసనాలు, అవశేషాలకు ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను ఢిల్లీలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని విస్తాగోయిన్ తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృత పరిశోధనకు అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పర్యావరణ శాఖ జిల్లా అధికారి నారాయణరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు. దీర్ఘాసి గ్రామంలోని ఈ చారిత్రక సంపదను సంరక్షించి, పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

**శ్రీకాకుళం, డిసెంబరు 19(వార్త):** జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ (2025-26)కు సంబంధించి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి కె. శ్రీనాథ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అవసరాల కోసం మొత్తం 26,000 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అక్టోబరు 1 నుంచి ఇప్పటివరకు 7,811 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరగ్గా, ప్రస్తుతం కో-ఆపరేటివ్ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్ ఫెడ్ మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద 2,020 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా లేదా కృత్రిమ కొరత సృష్టించినా డీలర్లపై ఎరువుల నియంత్రణ చట్టం-1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు ఎరువుల బస్తాలపై ఉన్న ఎంఆర్‌పి ధరను గమనించి, తప్పనిసరిగా రశీదు పొందాలని ఆయన సూచించారు.

## వీఆర్వోలకు హాజరులో వెసులుబాటివ్వండి

**పలాస, డిసెంబరు 19(వార్త):** గ్రామాలలో వీఆర్వోలు నిర్వహించే పనులకు అదనంగా పనులు చెబుతూ పనిభారం పెంచుకుంటూ పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతీష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ-సర్వేలో కీలకమైన పాత్ర పోషిస్తున్న వీఆర్వోలకు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అదనపు పనిభారం తగ్గించాలంటూ వీఆర్వోలు స్థానిక తహశీల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తికు మండల వీఆర్వోల సంఘం వినతిపత్రం అందజేశారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కంగేశ్వరరావు కే సింహాచలం ఆధ్వర్యంలో వీఆర్వోలు తహశీల్దార్‌ను కలిసి తమ సమస్యలు, రాష్ట్ర సంఘం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఉదయం 10-30 నుంచి సాయంత్రం 5 గం. 6గం.వరక తాము ఉద్యోగాలు చేస్తామని, తమకు సంబంధంలేని ఇతర శాఖల పనుల ఒత్తిడి నుంచి తప్పించాలంటూ వినతి పత్రం అందించారు. అనంతరం విలేకరులతో మా ట్లాడుతూ ఇళ్లస్థలాల విషయంలో సర్వే నెంబర్లు గుర్తింపు, హద్దులు రాయడం వరకే చేస్తామని, గృహ నిర్మాణాల్లో ఇచ్చిన డేటా ఎంట్రీలో వీఆర్వోలను కమిట్మెంట్ చేయడం సరైనది కాదన్నారు. సెలవురోజుల్లో పనులభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరితోపాటు పి అప్పలనాయుడు, ప్రసాద్, కళ్యాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయ, మీడియా ఆత్మీయ సమ్మేళనం




**పలాస, డిసెంబరు 19(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ బీచ్ నందు ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల ఆత్మీయ సమ్మేళనం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వజ్రపుకొత్తూరు మండలం ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ పర్యావరణం కోసం ప్రజలందరూ ఏకతాటిపై వచ్చి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్ మాట్లాడుతూ పర్యావరణ కోసం, సమాజాహితంకోసం ప్రజలతోపాటు యువత, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం చాలా అవసరం మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ నియోగాన్ని తగ్గించే బాధ్యత అందరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం బీచ్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ మరియు ఇతర చెత్త ఏరి వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో కొర్ల శ్రావణ్ కుమార్ సబ్ ట్రెజరీ అధికారి పీ మన్మధరావు, ఇరిగేషన్ అధికారి పి శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు మధుబాబు సిక్కోలు జానపద కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజ్, జానపద కళాకారుడు రంగస్థలం నటుడు కుమార్ నాయక్, జీడి రైతు సంఘ నాయకులు తెప్పల. అజయ్ కుమార్ పి డి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్,ఉపాధ్యాయులు జగదీశ్వర్ రావు, బొకర దుర్యోధన, ముంజేటి కిరణ్ కుమార్, రైల్వే యూనియన్ నాయకులు ఉమా మహేశ్వర రావు ,దివాకర్, ఫార్మసీ ఆఫీసర్ ఆర్ సుబ్రహ్మణ్యం, సూపర్వైజర్ రిషికేశ్వరరావు, గ్రీన్ ఆర్మీ సభ్యులు నూకల హేమసుందర్, హుస్సేన్ పలాస వజ్రపు కొత్తూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ఇది హెరీదాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న మురళి



**శ్రీకాకుళం, డిసెంబరు 19(వార్త):** విజయవాడ లోక్ భవన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్, హోం, అత్యవసర, విపత్తులు, సైనిక సంక్షేమ శాఖామాత్యులు వంగలపూడి అనిత చేతుల మీదుగా వీరనారీమణులకు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, టైపిస్ట్ మురళిలకు వారి ఉత్తమ సేవలకు అభినందనలు తెలుపుతూ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వి. వెంకటరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎక్స్ కెప్టెన్ సత్యప్రసాద్, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్, తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలో మేధో మథనం

### - రాష్ట్ర స్థాయికి 11 ప్రాజెక్టుల ఎంపిక

**శ్రీకాకుళం, డిసెంబరు 19(వార్త):** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం మునిసబేటలోని గురజాడ విద్యాసంస్థల ఆవరణలో ఘనంగా ముగిసింది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో చిన్నారుల ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు 310 సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వ్యవసాయం, పర్యావరణం, ఆరోగ్యం, గణిత నమూనాలు వంటి విభిన్న విభాగాల్లో ప్రాజెక్టులు అందరినీ ఆలోచింపజేశాయి. జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ ముగింపు వేడుకలో ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు వీరే..

ప్రదర్శించిన నమూనాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 11 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వీటిలో 7 గ్రూపు ప్రాజెక్టులు, 2 వ్యక్తిగత ప్రాజెక్టులు, 2 ఉపాధ్యాయుల ప్రాజెక్టులు ఉన్నాయి.



గ్రూపు విభాగంలో..

-మల్టీ పర్పస్ అగ్రికల్చర్ టూల్: ఐ.సంజన, ఎస్.అనిల్ (జడ్పీహెచ్ఎస్ ఇప్పిలి).

-యాంటీ సూసైడల్ ఫ్యాన్: బి.హరిసిత, ఎ.తనుశ్రీ (జి.జి.హెచ్.ఎస్ శ్రీకాకుళం).

-ప్యూరిఫికేషన్ ఆఫ్ వేస్ట్ వాటర్: డి.ఉమామహేష్, కె.గోపి (జడ్పీహెచ్ఎస్, బాతువ).

-పేషెంట్ స్మార్ట్ హెల్త్ మానిటరింగ్: కె.కె.పృథ్వీరాజ్, కె.దిలీప్ కుమార్ (జి.హెచ్.ఎస్, పొందూరు).

**వ్యక్తిగత విభాగంలో ..**

-కృష్ణవర్ధన్ (ఏపీఎంఎస్, సోంపేట) - స్మార్ట్ స్కానర్.

- ఎస్.కౌశిక్ (జడ్పీహెచ్ఎస్, పోలవరం) - రియల్ టైం విజిటర్స్ కౌంటర్.

**ఉపాధ్యాయ విభాగంలో ..**

- కె.కిరణ్ కుమార్ (జడ్పీహెచ్ఎస్, అదపాక) - విద్యుదయస్కాంత అనువర్తనాలు.

- బి.వెంకటరావు (జడ్పీహెచ్ఎస్, వాడాడ) - అల్ప ప్రాధాన్య బోధనా పరికరాలు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, మార్గదర్శక ఉపాధ్యాయులను ఈ సందర్భంగా డీఈఓ రవిబాబు ప్రత్యేకంగా అభినందించారు.



### బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

## చంద్రబాబు పాలనకు గీటురాయి



**పలాస, డిసెంబరు 19(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎకనామిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు ప్రకటించడం ఆయన పరిపాలనకు గీటు రాయిగా నిలుస్తుందని వివిధ వార్తక సంఘాల గౌరవ అధ్యక్షులు, టిడిపి నేత దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పలాసలో ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఎన్నో విప్లమాత్మకమైన పరిపాలన సంస్కరణలు తీసుకువచ్చి, నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారని దువ్వాడ కొనియాడారు. గత ప్రభుత్వంలో సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని కేవలం 18 నెలల కాలంలోనే వివిధ సంస్కరణలు తీసుకువచ్చి అమలు చేశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేలా ఇప్పటికీ 25 పాలసీలు తెచ్చారన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వము చేయని విధంగా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే ప్రోత్సాహకాలు కోసం ఎస్కో ఖాతా తెరవాలని నిర్ణయించారు. ఇలాంటి అనేక ప్రోత్సాహకాలు తోపాటు పాలసీలను రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబును దేశంలో గుర్తింపుగా ఎకనామిక్ టైమ్స్ అవార్డు ప్రకటించడం హర్షనీయమన్నారు. 'బిజినెస్ రెఫార్మర్ ఆఫ్ ద ఇయర్'గా ముఖ్యమంత్రి చంద్రబాబును దేశంలోనే వివిధ ప్రముఖులతో కూడిన జ్యూరీ ఎంపిక చేసిందన్నారు. ప్రతి రోజు కొత్తగా ఆలోచించాలని సీఎం చంద్రబాబు ప్రేరణ ఇస్తుంటారని, ఆయన ఒక జనరేషన్ ముందే ఆలోచిస్తారని, దేశంలో ఆర్థిక సంస్కరణలు తొలిసారిగా స్వీకరించిన రాష్ట్రంగా అప్పట్లో ఏపీని నిలిపిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. పవర్ సెక్టార్ రిఫార్మర్‌కు శ్రీకారం చుట్టింది ఆయనే అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడూ గుర్తింపు కోసం కాకుండా ప్రజల సంతృప్తి కోసమే ఆయన పని చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంతో టిడిపి శ్రేణులు కలిసి పని చేస్తున్నందుకు ఎంతో సంతో షంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు ఈ అవార్డు రావడం కూటమి ప్రభుత్వ దార్శ నికత, విశ్వాసాన్ని స్పష్టం చేసిందన్నారు. ప్రధానంగా జిల్లా అభివృద్ధిలో భాగంగా మూలపేట పోర్టు నిర్మాణం పనులు వేగవంతం చేయడమే కాక, పలాస నియోజకవర్గ అభివృద్ధిలో కూడా ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతిపాదించిన అభివృద్ధి పనులు అన్నిటికీ ఆమోదం తెలిపి పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546